క్లుప్తంగా

కృష్ణారావు సేవలు స్ఫూర్తిదాయకం



కుంచాల వెంకట కృష్ణారావు దంపతులను సత్కరిస్తున్న విద్యుత్ అధికారులు

అరసవల్లి: విద్యుత్ శాఖలో 35 ఏళ్లకు పైగా విధుల్లో ఉంటూ సేవలందించిన కృష్ణారావు విద్యుత్ ఉద్యోగులందరికీ మార్గదర్శకమని విద్యుత్ శాఖ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి కొనియాడారు. విద్యుత్ రెవెన్యూ విభాగం అసిస్టెంట్ అకౌంట్స్ అధికారి (ఏఏవో)గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన కుంచాల వెంకట కృష్ణారావును ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆపరేషన్స్ ఈఈ పైడి యోగేశ్వరరావు, ఎంఆర్‌టీ ఈఈ ఎస్.బయ్యన్నాయుడు, వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘ రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు వైశ్యరాజు శ్రీనివాసరాజు, ఆర్.శ్రీనివాస్, బీసీ ఉద్యోగుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు చల్లా వెంకటేశ్వరరావు, సనపల వెంకటరావు, బీసీ సంఘ నేతలు కాకర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్ష విజేతకు అభినందనలు



బహుమతి అందుకుంటున్న దివ్య

జి.సిగడాం: రణస్థలంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్‌లో జి.సిగడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని దివ్య ప్రతిభ కనబరిచి రూ.6వేల నగదు, ప్రశంసా పత్రం అందుకుందని హెచ్‌ఎం పి.వి.ఎస్.మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయులు బాలి అప్పలరాజు, సాయిరాం, కుప్పిలి రవికుమార్ పట్నాయక్, మందుల భారతి, తారకేశ్వరరావు, సిబ్బంది అభినందించారు.

ఆదిత్యుని సన్నిధిలో ప్రభుత్వ విప్



విప్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ వేపాడ చిరంజీవిరావు కుటుంబసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం ఈవో వై.భద్రాజీ, అర్చకులు స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం వేదాశీర్వచనాన్ని అందజేశారు.

ఎయిడ్స్‌పై అప్రమత్తం



నినాదాలు చేస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల: లావేరు శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఎయిడ్స్ డే సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్‌ను నిరోధించండి.. నిశ్శబ్దాన్ని ఛేదించండి, ఎయిడ్స్ వ్యాధికి మందు లేదు, నివారణ ఒక్కటే మార్గం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ ఎం.శ్రీనివాసరావు వ్యాసరచన పోటీల విజేత బి.దివాకర్‌కు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరబద్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్యామిలీ క్రిస్మస్



కొవ్వొత్తులు వెలిగిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కీస్టాన్ చర్చ్ పాస్టర్ జోయల్ శామ్యూల్ ఆధ్వర్యంలో ఆదివారం ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం క్యాండిల్ లైట్ సర్వీసు నిర్వహించారు. కార్యక్రమంలో లిడియా జాన్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో రోడ్లు.. అడుగడుగునా గోతులు

- కొత్త ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలవుతున్నా కానరాని మరమ్మతులు
- వాహనచోదకులకు తప్పని అవస్థలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

మేము అధికారంలోకి వచ్చిన వెంటనే గోతులు లేకుండా రహదారులు అభివృద్ధి చేస్తాం.. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామంటూ ప్రగల్భాలు పలికిన కూటమి నాయకులు గద్దెనెక్కాక హామీలు మర్చిపోతున్నారు. కొత్త రోడ్ల సంగతి అటుంచితే పాత రోడ్ల నిర్వహణ గాలికొదిలేయడంతో వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. శ్రీకాకుళం నగరంలో ప్రధానంగా ఉమెన్స్ కాలేజీ రోడ్డు, పాలకొండ రోడ్డు, అరవసల్లి రోడ్డు, రామలక్ష్మణ కూడలి నుంచి పెద్దపాడు రోడ్డు, పాతబస్టాండ్ నుంచి పొన్నాడ వంతెన రోడ్డు, అంబేడ్కర్ కూడలి వద్ద ఎక్కడికక్కడ గోతులు ఏర్పడ్డాయి. దీంతో వాహనాలు గోతుల్లో దిగిపోతున్నాయి. కొన్నిసార్లు వాహనచోదకులకు గాయాలు సైతం తప్పడం లేదు. మంత్రులు, ఎమ్మెల్యే, కలెక్టర్ నిత్యం



గోతులమయంగా మహిళా కళాశాల రోడ్డు

రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఇంతవరకు పట్టించుకోకపోవడం తగదని మండిపడుతున్నారు.

తరచూ ప్రమాదాలు..



ప్రతి రోజూ మార్కెట్‌కి రాకపోకలు సాగిస్తుంటాం. పాలకొండ రోడ్డులో గోతుల్లో పడి ఎవరో ఒకరు ప్రమాదాలకు గురవుతున్నారు. పాలకులు స్పందించి రోడ్డు సమస్య పరిష్కరించాలి.
– నాగుల రాము, శ్రీకాకుళం

చర్యలు చేపడతాం..



నగరంలో రోడ్లన్నీ పరిశీలించి అవసరమైన చోట మరమ్మతులు చేయిస్తాం. కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి సమస్య తీసుకెళ్లి చర్యలు చేపడతాం.
– పి.వి.వి.డి ప్రసాద్, కమిషనర్, శ్రీకాకుళం నగరపాలక సంస్థ



పాలకొండ రోడ్డులో కృష్ణాపార్కు సమీపంలో..

నిరుపయోగంగా యంత్రాలు



ఎచ్చెర్ల మండల కేంద్రంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో మోడల్ గోదాము నిర్మించారు. ఇందులో ధాన్యం శుభ్రం చేసే యంత్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు వీటిని ఉపయోగించకుండా వదిలేశారు. ప్రస్తుతం ఆ యంత్రాలన్నీ తుప్పుపట్టి నిరుపయోగంగా మారుతున్నాయి.
– ఎచ్చెర్ల క్యాంపస్

చెరువు కాదు హైవే!



తేలికపాటి వర్షం పడినా జాతీయ రహదారిపై ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతోంది. కింతలి మిల్లు, నవభారత్, ఎచ్చెర్ల, చిలకపాలెం తదితర కూడళ్లలో డ్రైనేజ్ వ్యవస్థ సక్రమంగా లేక రోడ్డు డిజైన్‌లో లోపాలు వంటి కారణాలతో నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా ఫ్లై ఓవర్ల సమీపంలో ఈ పరిస్థితి ఏర్పడుతోంది.
– ఎచ్చెర్ల క్యాంపస్

దారి పొడవునా ఇసుక పోగులే



శ్రీకాకుళం సింహద్వారం కూడలి నుంచి పూడివలస (కింతలి, కనిమెట్ట) వైపు వెళ్లే దారిలో అక్రమ ఇసుక పోగులు దర్శనమిస్తున్నాయి. ఉచిత ఇసుక ముసుగులో ప్రధానంగా తమ్మినాయుడుపేట ఇసుక రీచ్ నుంచి ట్రాక్టర్ల ద్వారా తీసుకొచ్చి పోగులుగా నిల్వ చేసి అర్ధరాత్రి సమయంలో లారీల్లో విశాఖపట్నం ఇసుక తరలిస్తున్నారు.
– ఎచ్చెర్ల క్యాంపస్

ప్రజలపై విద్యుత్ చార్జీల బాదుడు

- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచనని అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక హామీలను తుంగలోకి తొక్కారని, ప్రజలను మోసగించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ దుయ్యబట్టారు. రణస్థలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాబు చెప్పిన ష్యూరిటీ ఏమోగానీ.. ప్రజలకు బాదుడు మాత్రం గ్యారెంటీ అన్నట్లుగా పరిస్థితి తయారైందన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, ట్రూ అప్ చార్జీలు ఎత్తేస్తామని బీరాలుపోయిన చంద్రబాబు తాను ఏ హామీ ఇవ్వలేదంటూ ఇప్పుడు నిస్సిగ్గుగా బుకాయిస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే రెండో సారి ట్రూ అప్ చార్జీలు భారం మోపాడం దారుణమన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం దీపావళి పండగకు రాష్ట్ర ప్రజలపై రూ.6072.86 కోట్ల భారం వేసిందని, ఈ చార్జీలను యూనిట్‌కు రూ.1.27 చొప్పున నవంబర్ నుంచి వసూలు చేస్తున్నారని గుర్తు చేశారు. తాజా చార్జీలతో కలిపి జనవరి నుంచి యూనిట్‌కు



విద్యుత్ చార్జీలపై మాట్లాడిన చంద్రబాబు వీడియోను చూపుతున్న గొర్లె కిరణ్‌కుమార్

రూ.2.19 అదనంగా వినియోగదారులు చెల్లించాల్సి ఉందని చెప్పారు. గతంలో వేసిన రూ.6072.86 కోట్లు తాజాగా వసూలు చేస్తున్న రూ.9412.50 కోట్లు కలిపి మొత్తంగా కూటమి ప్రభుత్వం ఈ ఐదు నెలల్లో రూ.15485.36 కోట్లు భారం ప్రజలపై మోపిందని వివరించారు. పులివెందుల సభలో చార్జీలు పెంచబోమని చంద్రబాబు ఎలా చెప్పారో వీడియోను విలేకరులకు కిరణ్ చూపించారు. వైఎస్సార్‌సీపీ పాలనతో పోలిస్తే కూటమి పాలనలో నిత్యావసర సరుకుల నుంచి స్కూల్ ఫీజులు వరకు అన్నీ దారుణంగా పెరిగాయని చెప్పారు. చంద్రబాబు రెండు నాల్కల ధోరణిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

మోడల్ టెస్టులతో మెరుగైన ఫలితాలు



నగదు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్, సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: మోడల్ పరీక్షలతో విద్యార్థులకు మరింత అనుభవం లభిస్తుందని.. తద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. విద్యార్థుల పట్ల పీఆర్‌టీయూ చూపిస్తున్న చొరవ అభినందనీయమన్నారు. నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు సంబంధించిన మోడల్ పరీక్షను పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆదివారం అరవసల్లిలోని పీఆర్‌టీయూ భవనంలో నిర్వహించారు. శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాలలోని పలు ప్రాంతాల నుంచి 400 మంది బాలబాలికలు హాజరయ్యారు.ఐ.హర్షవర్ధన్ (ఏపీఎస్‌ఎంహెచ్ స్కూల్, గుజరాతీపేట), ఎం.పూర్ణచంద్రరావు (ఏపీఎస్‌ఎం హెచ్‌స్కూల్ గుజరాతీపేట), వి.తనుశ్రీ (జెడ్పీ హెచ్ స్కూల్ వప్పంగి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వరుసగా రూ.3వేలు, 2వేలు, వెయ్యి రూపాయలు చొప్పున నగదు బహుమతులు, జ్ఞాపికలను అందుకున్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దానేటి కేశవరావు, పప్పల రాజశేఖర్, శ్రీకాకుళం రూరల్ మండలశాఖ ప్రతినిధులు కుంచాల సత్యనారాయణ, వసంత రాజారావు, రాష్ట్ర, జిల్లా నాయకులు జి.యోగానంద్, వి.హరిశ్చంద్రుడు, కిరణ్‌కుమార్, సుదర్శనరావు, కిషోర్, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యునికి ప్రత్యేక పూజలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆదిత్యుని మూలవిరాట్టును ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. వర్షం కురుస్తుండడంతో భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయ సూపరింటెండెంట్ కనకరాజు ఆధ్వర్యంలో తగు చర్యలు చేపట్టారు.

ఆదినారాయణకు గౌరవ డాక్టరేట్

శ్రీకాకుళం న్యూకాలనీ: హిందీ భాషాభివృద్ధికి చేసిన సేవలకుగాను ముద్దాడ ఆదినారాయణ మాస్టారుకు గౌరవ డాక్టరేట్ లభించింది. హైదరాబాద్‌కు చెందిన ప్రఖ్యాత గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ నుంచి గౌరవ డాక్టర్‌ను అందుకున్నారు. హిందీ సబ్జెక్టుకే వన్నెతెచ్చిన ఈ విశ్రాంత ఉపాధ్యాయుడు 2022 సెప్టెంబర్ 5న గుంటూరు వేదికగా నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న సంగతి తెలిసిందే. గత కొన్నేళ్లగా విద్యతోపాటు వివిధ విద్యాపరమైన సేవా, సామాజిక కార్యక్రమాల్లో ఉత్తమ సేవలను అందించడంతో తనకు ఈ డాక్టరేట్‌ను అందజేసినట్టు ఆదినారాయణ తెలిపారు. 35 ఏళ్లకు పైగా హిందీ మాస్టారుగా సేవలందించిన ఆదినారాయణ ఏయూ నుంచి ఎంఏ హిందీ పూర్తి చేశారు. అలహాబాద్ యూనివర్సిటీ నుంచి హిందీ సాహిత్య రత్న అందుకున్నారు. హిందీ ప్రచార సభను మూడు దశాబ్దాలపాటు నడిపించి వందలమంది హిందీ టీచర్లను తయారుచేశారు. ఎన్నో అవార్డులను, రివార్డులను అందుకున్నారు. ప్రస్తుతం శ్రీకాకుళంలోని ఎల్బీఎస్ కాలనీలో నివాసం ఉంటున్నారు. గౌరవ డాక్టరేట్ లభించడం పట్ల కుటుంబ సభ్యులు, పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



గౌరవ డాక్టరేట్ పట్టాతో ముద్దాడ ఆదినారాయణ

రచనలు చిరస్థాయిగా నిలవాలి



కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులు

శ్రీకాకుళం కల్చరల్: చిరస్థాయిగా నిలిచేలా రచనలు సాగాలని వక్తలు పేర్కొన్నారు. తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో 99వ నెల సాహితీ సమ్మేళనం జిల్లా కేంద్రంలోని శాంతినికేతన్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. సంస్థ అధ్యక్ష కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి మాట్లాడుతూ రాబోవు 100వ నెలవారీ సాహితీ సమ్మేళనం కార్యక్రమంలో తెరవే కవుల రచనలతో కూడిన కవితా సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరిస్తామని తెలిపారు. రచయిత జంధ్యాల శరత్‌బాబు మాట్లాడుతూ శత మాస కవిసమ్మేళనలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. అంతకుముందు సంస్థ సభ్యులు అయ్యగారి సుమిత్రమ్మకు అంజలి ఘటించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు డాక్టర్ కోమలరావు, ఇద్ది పాపయ్య, నిక్కు హరిసత్యనారాయణ, ఐఎన్‌డీ ప్రసాద్, కిల్లాన శ్రీనివాస్, వి.రాజారావు, ముట్నూరు ఉపేంద్రశర్మ, భోగెల ఉమామహేశ్వరరావు, పూడి జనార్దన్, కుప్పిలి త్రినాథరావు, ఎస్.ఈశ్వరరావు, బాలాజీ రవికిరణ్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఇసుక తరలింపు



తమ్మినాయుడుపేట సమీపంలో బోల్తాపడిన ట్రాక్టర్



కింతలిమిల్లు సమీపంలో జాతీయ రహదారిపై కంచెను ఢీ కొట్టిన ట్రాక్టర్(ఫైల్)

- నిబంధనలు పాటించని ట్రాక్టర్ డ్రైవర్లు
- తరచూ రోడ్డు ప్రమాదాలు

ఎచ్చెర్ల క్యాంపస్ :

ధనార్జనే ధ్యేయంగా కొందరు ఇసుక అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. ఉచిత విధానం ముసుగులో యథేచ్ఛగా ఇసుక తరలింపునకు ట్రాక్టర్లు వినియోగిస్తున్నారు. లారీలను రీచ్‌ల్లో దించటం సాధ్యం కాకపోవడంతో ట్రాక్టర్ల ద్వారా ఇసుక లోడింగ్ చేస్తున్నారు. ఎచ్చెర్ల మండలంలోని తమ్మినాయుడుపేట, పాతపొన్నాడ, వెంకన్నగారిపేట, ముద్దాడపేట ఇసుక రీచ్‌ల నుంచి తీసుకెళ్లి జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న కుశాలపురం, కేశవరావుపేట, చిలకపాలేం, అల్లినగరం తదితర ప్రాంతాల్లో డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి విశాఖపట్నం తరలిస్తున్నారు.

నిబంధనలకు తూట్లు...

ఇసుక తరలింపులో తరచూ ట్రాక్టర్లు ప్రమాదాలకు గురవుతున్నాయి. వాహనాలు కండీషన్‌లో లేకపోవటం, తడి ఇసుక లోడింగ్ చేయటంతో బరువు ఎక్కువగా ఉండటం, అనుభవం, అర్హత లేని వారు ట్రాక్టర్లు నడపటం, ఇసుక తరలించేటప్పుడు తొట్టిపై టార్పాలిన్లు కప్పకపోవటం వంటివి చోటు చేసుకుంటున్నాయి. దీంతో తరచూ ట్రాక్టర్లు బోల్తా పడటం, డివైడర్లను ఢీకొట్టడం, ప్రమాదాల నియంత్రణకు ఏర్పాటు చేసిన ఇనుప కంచెను ఢీ కొట్టటం వంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ సమయంలో ఇతర వాహనచోదకులకు సైతం ప్రమాదం పొంచి ఉంటోంది.



జాతీయ రహదారిపై ట్రాక్టర్‌పై టార్పాలిన్ కప్పకుండానే ఇసుక తరలిస్తున్న దృశ్యం

నిబంధనలు పాటించాలి..



ఉచిత ఇసుక ప్రభుత్వ నిబంధనలు మేరకు తరలించాలి. అధిక బరువు లోడింగ్, వా హనం కండీషన్‌లో లేకపోవటం, అర్హత గల డ్రైవర్లు వాహనాలు నడపకపోవటం వంటి నిబంధలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తాం.
– వి.సందీప్‌కుమార్, ఎస్సై, ఎచ్చెర్ల

నట్టేట మునిగిన రైతన్న

రణస్థలం:

చేతికందిన వరి పంటను ఫెంగల్ తుఫాన్ నట్టేట ముంచేసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రణస్థలం, లావేరు మండలాల్లో వందలాది ఎకరాల్లో పంటకు ముప్పు ఏర్పడింది. ఈ ఏడాది రణస్థలం మండలంలో 5600 ఎకరాలు, లావేరు మండలంలో 5900 ఎకరాల్లో వరి పంట వేయగా అందులో 70శాతం కోతలు పూర్తయి కుప్పలు పెట్టారు. మిగిలిన 20 శాతం కోత కోయాల్సి ఉండగా, మరో 10 శాతం పంట కోసి ఆరబెట్టడంతో నీట మునిగిపోయింది. పంట తడిసిపోయిందని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని లావేరు మండలం తాళ్లవలసకు చెందిన సంచాన సూర్యనారాయణ, మీసాల నరసింహం, మీసాల సత్యం, జమ్ము అప్పలనాయుడు తదితర రైతులు కోరుతున్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని ఫరీదుపేట, ఇబ్రహీంబాద్, పూడివలస, కుశాలపురం, తోటపాలెం తదితర గ్రామాల్లో రైతులు పంట కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికీ రైతులు ఆందోళనలోనే ఉన్నారు. బడివానిపేట, బుడగుట్లపాలెం, డి.మత్స్యలేశం పంచాయతీల్లో మత్స్యకారులు వేటకు దూరంగా ఉన్నారు.

జి.సిగడాం: తుఫాన్ నేపథ్యంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ సూచించారు. వరి పంటను జాగ్రత్తగా భద్రపరుచుకునేలా రైతులకు సహకరించాలని కోరారు.

ఎచ్చెర్ల క్యాంపస్: అకాల వర్షాలు గొర్రెల కాపరుల పట్ల శాపంగా మారాయి. పొలాల్లో మందలు వేసిన తరుణంలో ఎడతెరిపిలేకుండా వర్షం, చలిగాలుల ధాటికి గొర్రెలు, మేకలు ఇబ్బందులు పడుతున్నాయి.



తాళ్లవలసలో నీట మునిగిన వరి పంటను చూపుతున్న రైతు జమ్ము అప్పలనాయుడు



రణస్థలంలో నేలకొరిగిన వరి పంట



పూడివలసలో వరి కుప్పలు



కుశాలపురంలో వరి కుప్పలపై వేసిన టార్పాలిన్లు



నవభారత్ సమీపంలో చినుకుల కిందే గొర్రెల మంద